# కప్పుర భోగి వంటకం కమ్మని గోధుమ వంట

ఆ నాడే కాదు - ఈ నాడే - కాదు - రేపు - రేపే కాదు ఏనాడైనా మనిషి కోరేవి మూడే మూడు ! కూడు - గుడ్డ - గూడు. వాటిల్లో ముందు కోరేది కూడు! తిండి కలిగితే కండ కలదోయ్ కండ గలిగిన వాడే మనిషోయ్ అన్నట్లు అన్నిటికి మించి అన్ని సుఖాలకు మించి కోరేది భోజన సుఖం. అదుంటేనే ఆపైవన్నీ.

ఒక రోజు ఓరుగల్లు నగరంలో ఇద్దరు మిత్రులు తిరుగుతూ ఎదురుగా వస్తున్న పరదేశిని చూశారు. అతడు బాగా భోజనంచేసి వస్తున్నాడు ఈ మిత్రులు పూట కూటి వంటకం గూర్చి అడిగారు. దానికి విహారములకో - ఆహారమునకో - విహారమునకో - బేహారము అని అడిగి ఆహారమునకు అంటే వినండి.

కప్పుర భోగి వంటకము కమ్మని గోధుమ పిండి వంటయున్
గుప్పెడు పంచదారయును కొత్తగ కాచిన యాలనే పెసర్
పప్పును కొమ్ము నల్లటి పండ్లును నాలుగునైదు నంజులున్
లప్పల తోడ క్రొంబెరుగు లక్ష్మణ వజ్ఝల యింట రూకకున్

అయ్యా - మీరు పూట భోజనానికి ఒక రూక ఇస్తే ఆ లక్షణ వఝుల వారింట మంచి పసందైన భోజనము దొరుకుతుంది. ఎలాగంటావా? కప్పుర భోగి బియ్యంతో అన్నం వండుతారు. చేయి చురుక్కునేలా అప్పుడే కాచిన ఆవు నేయి వడ్డిస్తారు. కమ్మని వేడి వేడి పెసరపప్పుకి ఆ నెయ్యి జోడైతే నసాలం అంటుతుంది. నాలుగైదు పచ్చళ్ళు ఊరగాయలు ఉంటాయి. పైగా గోధుమ పిండి వంటలుంటాయి. అరటి పళ్ళు - పంచదార అంతేనా గడ్డ పెరుగు గుమ్మరిస్తారు. జిహ్వా తర్పణంగా వుంటుందనుకో -

బహుశా కవి గారు అలాంటి భోజనం ఆరగించాక దాన్ని గుర్తు చేసుకొని ఆ రుచిని నెమరు వేసుకొని చెప్పి ఉంటారు. ఈ పద్యాన్ని. నిజానికి సాహిత్యంలో ఎక్కువగా భోజనానికి సంబంధించిన వర్ణనలే ఎక్కువగా ఉంటాయి. ఎవరో కవి "భోజనం దేహీ రాజేంద్ర ఘృత సూప సమన్వితం మాహిషంచ శరశ్చంద్ర చంద్రికా ధవళం దధి" అని భోజుడ్ని అడిగాడట! మళ్ళా మాన్యాలు కాదు హారాలు అగ్రహారాలు కాదు అడిగింది ! భోజనం ! !

శ్రీనాధుడిలా భోజన ప్రియుడు ఎవరూ ఉండరేమో. అందుకే ఆయన కవిత్వంలో, గ్రంధాల్లో, చాటువుల్లో భోజన వర్ణనలు చాలా చోట్ల చోటు చేసుకొన్నాయి.

ఆయన విద్యానగరం వెళ్ళి ఓ మామూలు కవిగా రాజుగారి దర్శనం కొరకు పడిన పాట్లు ఒక ఎత్తు - అక్కడ భోజనం రుచించక పడ్డ పాట్లు ఒక ఎత్తు అందుకే

కుల్లా యుంచితి కోక సుట్టితి మహా కూర్పాసమున్ తొడ్గితిన్
వెల్లుల్లిన్ తిల షిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా
చల్లా అంబలి త్రావితిన్ రుచుల్ దోసం బంచు పోనాడి తిక తల్లీ....

అని వాపోయాడు....

నిజమే మరి రాజులు పంపే దినవెచ్చాలతో హేమపాత్రల్లో సుష్టుగా సరస సల్లా పాలతో విందారగించిన కవీంద్రుడికి విశ్వస్త వడ్డిస్తే అంబలి మజ్జిగ తాగి వెల్లుల్లి తినడం కష్టమే. అక్కడే కాదు. పలనాటి సీమలో ఆయనకి ఎటు చూసినా ఎటుపోయిన జొన్న కలి జొన్న అంబలి జొన్నన్నము జొన్న పిసరు జొన్నలు తప్ప మరేమి కన్పించలేదు. అందుకే ఆ తిండి తినలేక శివుడిని సవాలుచేశాడు.

పూర్వమందు విషము పుచ్చుకున్నానని గర్వపడెదవేల గరళకంఠ!
కొండవీటి సీమపందు జొన్నలి కూడు తిన్న నీదు బయసి
తేట పడును !

బహుశా కొంత నీటి జొన్నన్నం పండు మిరప పచ్చడి నోరు చురుక్కుమన్పించి ఉంటాయి. అంతే కాదు ఆ భోజనం చూసి జిహ్వ చచ్చి ఉంటుంది. దాంతో

కఠినంపు జొన్నల కటుకు కుడుములు సూచి వక్త్రమా భయపడవద్దు సుమ్మా

నా నారుచుల్ కోరు నాలుక నీవెమి సందేహ పడవద్దు చప్పరించు

ఎన్నడు కడి చేయ నెరుగ నెట్లో యని కుడిహస్తమా నీవు జడియబోకు

కమ్మని బాసనల్ గ్రక్కున లేన్చెదు గర్భమా కుట కుట కాకయుండు

అని నచ్చ చెప్పుకున్నాడు. అయితే ఈ భోజన సుఖాన్ని గూడా గుర్తు పెట్టుకున్నాడు కాబోలు.

నడినూక లేని అన్నము

వడబోసిన నెయ్యి బుడమ వరుగున్ పెరుగున్

గడిమిద నీయ బెట్టిన

నడ గూడెవు నంబి పడుచు నడిగితి ననుమీ

అని కుశలం అడిగాడు. ఇలా కబరు పంపడం ఆయనకి అలవాటే.

గుడిమీద కోతి తోడను

గుడి లోపలి నంబివారి కోడలితోన్

నడివీధి వేశ్య తోడను

నడి గొప్పుల పైరగాలి నడిగితి ననుమీ

అలనాడు ఆనందం పంచిన వారిని మరువక పలకరించడం విట ధర్మం కాబోలు

తిరిగి తిండి విషయానికి వస్తే తాగిన చల్లను గుర్తు తెచ్చుకోవడం గొప్పే

గొప్పయిన నిమ్మ పండ్లను
కప్పురమును సొంఠి పొడియు కరివేపాకున్
ఉప్పును యేలకు ఇంగువ
ఒప్పుగ నీ చల్ల రుచికి నొనగూర్పదగున్

ఇలా విశేషంగా వర్ణించడం ఒక కళే గదా! హాయిగా భోజనం చేసిన వారికి ససిలేని భోజనం పెడితే చుర్రు మనదూ ? అందుకే ఆ దేవుడ్నే మళ్ళీ సవాల్ అన్నాడు శ్రీనాధుడు.

పుల్ల సరోజ నేత్ర అలపూతన చన్నుల చేదు తావినా
నల్లదవాగ్ని మిగింతి నటంచును నిక్కెదవేల తింత్రిణీ
పల్లవ యుక్తమౌ ఉడుకు బచ్చలి శాకము జొన్న కూటితో
మెల్లన ఒక్క ముద్ద దిగ మింగుము నీ పస కాననయ్యెడిన్

ఇలా తిండి మీద దండిగా కవిత చెప్పిన కవులు అరుదే - శ్రీనాధుడే అందుకు శ్రీకారనాధుడు.

--o--